సర్కారు బడుల్లో ఒత్తిడిలేని చదువులు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- రెంజల్, నవీపేటలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల పంపిణీ


విద్యార్థులకు డ్రెస్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడిలేని చదువుతో పాటు నాణ్యమైన విద్యా బోధన లభిస్తుందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సర్కారు బడుల్లో డీఎస్సీ అర్హతతో ఉద్యోగాలు సాధించిన అత్యుత్తమమైన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కనీస సదుపాయాలను అందిస్తుందని వివరించారు. విద్యార్థుల తల్లి దండ్రులు ఆర్థికంగా నష్టపోకుండా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, డ్రెస్‌లు, మధ్యాహ్న భోజనంతో పాటు ఇతర సదుపాయాలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఈవో దుర్గాప్రసాద్, ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ మేక విజయ, ఆర్‌డీవో అంబాదాస్ రాజేశ్వర్, నాయకులు మొబిన్‌ఖాన్, సాయరెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఓపికతో విద్యాబోధన చేయాలి


నవీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవీపేట: విద్యా బుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు ఓపికతో విద్యా బోధన చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సందేహాలను ఓపికతో నివృత్తి చేస్తే భవిష్యత్తులో పదోన్నతులు వస్తాయని, మీ పిల్లలకు మంచి ఉద్యోగాలు వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి 75 శాతం మార్కులు రావాలని, ఆ దిశగా విద్యా బోధన సాగాలని సూచించారు. అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయంలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ నారాయణ, ఎంఈఓ గణేష్‌రావ్, నాయకులు మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్ ఉన్నారు.

క్లుప్తంగా

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామపంచాయతీల్లో గురువారం మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్, సీజనల్ వ్యాధులు, పరిసరాలు శుభ్రతపై గురువారం ఎంపీడీవో రాజశ్రీనివాస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో పరిసరాల శుభ్రతపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీవో సదాశివ్, కార్యదర్శి శాంతికుమార్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌లో బాల్కొండ నియోజకవర్గ స్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ ముప్కాల్ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయకులు ముత్తెన్న, మహేందర్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులగానైనా గుర్తించండి



ఆర్మూర్: పదహారేళ్లుగా 104లో విధులు నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా లేదా కనీసం కాంట్రాక్టు ఉద్యోగులుగానైనా గుర్తించాలని కోరుతూ 104 సిబ్బంది సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. యస్వాడ ప్రకాష్, కృష్ణ , ప్రకాష్, ప్రవీణ్, పురుషోత్తం, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో గురువారం 10 కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆఫీస్ ఫర్నిచర్ కోసం ఇప్పటి వరకు 100 కుర్చీలు, పది టేబుల్స్ అందజేసినట్లు తెలిపారు. అలాగే కుర్చీల వితరణకు దాతగ వ్యవహరించిన క్లబ్ మాజీ అధ్యక్షుడు రాజ్ కుమార్ అగర్వాల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. క్లబ్ కార్యదర్శి పట్వారి తులసి కుమార్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్పాకర్ రావు,తదితరులున్నారు.

గోవుల అక్రమ రవాణా అరికట్టాలి

రుద్రూర్: గోవుల అక్రమ రవాణ అరికట్టాలని గోరక్షణ సంవర్ధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం ఎస్సై అప్పారావ్‌కు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...బక్రీద్ సందర్భంగా నిఘా ఏర్పాటు చేసి గోవుల వధ జరుగకుండా చూడాలని కోరారు.

చెక్‌పోస్టు తనిఖీ



నందిపేట్(ఆర్మూర్): బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా జరుగకుండా నందిపేట మండలంలోని ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం మండల వెటర్నరీ అధికారి హన్మంత్‌రెడ్డి తనిఖీ చేశారు. రాత్రి సమయంలో పశువుల అక్రమ రవాణ జరుగనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని సూచించారు.

అనుమానితులను అరెస్టు చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రాంపూర్ పోశన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని, అనుమానితులను అరెస్టు చేయాలని కుటుంబ సభ్యులు శుక్రవారం ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ను కోరారు. పోశన్నను కొందరు విద్యుత్‌షాక్‌తో హత్యచేసి ఉంటారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గతంలో భూతగాదాల విషయంలో పలుమార్లు హత్య చేస్తామని పోశన్నను కొందరు బెదిరించారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోకు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా తప్పదు


జరిమానా రసీదును అందజేస్తున్న ఇంజనీర్

ఆర్మూర్‌టౌన్: ఇకపై ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా తప్పదని పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి అన్నారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్ మామిడిపల్లిలో గురువారం కాలుష్య నియంత్రణ మండలి, సీడీఎంఏ ఆదేశాల మేరకు పలు దుకాణాల్లో ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణమౌళి మాట్లాడుతూ..పనుల నిమిత్తం దుకాణాలకు వచ్చే కస్టమర్లకు బట్ట సంచులు, స్టీల్‌డబ్బాలు వినియోగించే విధంగా సూచించాలన్నారు. మటన్, టిఫిన్ తదితర దుకాణదారులు దుకాణం ఎదుట స్టీల్ డబ్బాలు తీసుకురావాలని బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. పలు దుకాణాల్లో తనిఖీల్లో పట్టుబడిన ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.7 వేల జరిమానా విధించామన్నారు.

రోడ్డు చెరువైన వేళ..


నవీపేటలో రాంపూర్ వెళ్లే దారిలో నిలిచిన నీరు

- రాకపోకలకు ఇబ్బందులు

నవీపేట: రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. ఇదే రోడ్డు వెంబడి ఫతేనగర్, రాంపూర్, ఎల్‌కే ఫారంలతో పాటు రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి, బాగేపల్లి గ్రామాలకు వెళ్తారు. రోడ్డుపై అడుగున్నర లోతు నీరు నిలవడంతో ప్రయాణికులు, ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు


రెంజల్‌లో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

రెంజల్(బోధన్): రెంజల్‌లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్మికులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు 8 రోజులుగా పనులు మానేశారు. గ్రామంలో రోడ్లపై చెత్త పేరుకపోవడంతో కార్యదర్శి పక్క మండలం నుంచి మంగళవారం కూలీలను పిలిపించి పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జీపీ కార్మికులు అక్కడికి చేరుకుని కూలీలతో వాగ్వాదానికి దిగారు. తమకు వేతనాలు అందించకుండా పక్క మండలం నుంచి కూలీలకు రోజుకు రూ. 500 ఇచ్చి ఎలా పిలిపించారని కార్మికులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. శుక్రవారం కార్మికులకు జీతాలు చెల్లిస్తానని కార్యదర్శి భరోసా ఇవ్వడంతో ఆందోళన మానుకున్నారు.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయం ఆవరణలో గల మేరు సంఘం శివాలయం సమీపంలో నూతన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని మేరు సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్ రాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దీంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. త్వరగా పనులు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి

వర్ని(మోస్రా): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మోస్రా జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి సూచించారు. గురువారం మోస్రా హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములుతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సన్న బియ్యంతో పాటు కూరగాయలకు, గుడ్లకు డబ్బులు చెల్లిస్తున్నందున నాణ్యత విషయంలో రాజీ పడకుండా మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల ద్వారా కుట్టించిన దుస్తులను పంపిణీ చేశారు. ఎంపీపీ ఉమా, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీరాములు ఎంఈవో శాంతకుమారి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో ప్రవీణ్, హెడ్మాస్టర్ బాలాజీ రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి


పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్

భీమ్‌గల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు.. సీజనల్ వ్యాధులు, అంటు రోగాల నివారణపై దేవన్‌పల్లిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో గురువారం ఎంపీడీవో సంతోష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు.

బొప్పాపూర్‌లో..

రుద్రూర్: సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంపీవో పి.సాయిలు సూచించారు. బొప్పాపూర్ జీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీపీ కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన రఫిక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో రఫిక్ కుటుంబ సభ్యులకు గురువారం మండల మెడికల్ అసోసియేషన్ సభ్యులు రూ: 40 వేల చెక్కును అందించారు. స్థానికంగా మెడికల్ నడుపుకుంటూ జీవనం సాగించే రఫిక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం ఉందని తెలిసి సహాయం అందించినట్లు వారు తెలిపారు.

అభినందనలు

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్‌ను గురువారం ఆర్మూర్ న్యాయవాదులు అభినందించారు. జగన్మోహన్‌గౌడ్ తెలంగాణ రాష్ట్ర న్యాయవాద ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులవడంతో ఆర్మూర్ న్యాయవాది జెస్సు అనిల్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజ్ కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పుస్తకాలు, దుస్తుల పంపిణీ



సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తుల పంపిణీ కొనసాగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యా శాఖ అధికారులతో కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..విద్యార్థులు బాగా చదివి గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

నాగుపాముకు చికిత్స



నందిపేట్: గాయపడ్డ నాగుపాముకు మండల వెటర్నరీ డాక్టర్ గురువారం చికిత్స చేశారు. మండల కేంద్రంలో స్నేక్ స్నాచర్ మున్నా నాగుపామును ఓ ప్రాంతంలో పట్టుకున్న సందర్భంలో పాముకు గాయమైంది. దీంతో అతను స్థానిక పశు వైద్యకార్యాలయానికి తీసుకురాగా గాయపడిన నాగుపాముకు డాక్టర్ హన్మంత్‌రెడ్డి చికిత్స చేశారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలివేసినట్లు స్నేక్ స్నాచర్ మున్నా తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్‌లో గురువారం విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందింది. పిట్టల స్వామి అనే రైతుకు చెందిన బర్రె మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి దగ్గరగా వెళ్లగా దీంతో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించగా లైన్‌మన్ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

వర్ని(మోస్రా): మండల కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు దహనం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో వైష్ణవి దేవి ఆలయానికి వెళుతున్న భక్తులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మను కాల్చారు.

‘విద్యార్థులు నిరంతరం అధ్యయనం చేస్తుండాలి’



మాట్లాడుతున్న కట్ట రమా

ఆర్మూర్: విద్యార్థులకు సామాజిక, పరిశోధనాత్మక అధ్యయనం అవసరమని, అందుకు విద్యార్థులు నిరంతర అధ్యయనం చేస్తూ పరిశీలనా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి కట్ట రమా సూచించారు. ఆర్మూర్ మండలంలోని మైత్రి గార్డెన్స్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు నాలుగో రోజు గురువారం కొనసాగాయి. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ తరగతుల్లో రచనలు ఎలా చేయాలనే అంశంపై ఆమె మాట్లాడారు. పీడీఎస్‌యూ నేతలు కావ్య, ఎస్.నాగేశ్వర్ రావు, రామకృష్ణ, నామాల ఆజాద్, అనిల్, నరేందర్, ఎర్ర అఖిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు వివాదంపై విచారణ


కొలతలు తీసుకుంటున్న అధికారులు

బోధన్: పట్టణ కేంద్రంలో రైల్వే గేట్ సమీపంలో ఉన్న డాక్టర్ అల్లామా ఉర్దూ ఘర్ భవనం ముందున్న రేకుల షెడ్డు వివాదంపై గురువారం స్థానిక రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమిష్టిగా విచారణ చేపట్టారు. కొన్నేళ్ల క్రితం మున్సిపల్ శాఖ పరిధిలోని స్థలాన్ని మున్సిపల్ కౌన్సిల్ కేటాయించగా రేకుల షెడ్డును నిర్మించుకున్నామని, ఆ షెడ్డును ఉర్దూ ఘర్ కమిటీ స్వాధీనం చేసుకుందని తెలంగాణ ఉర్దూ జర్నలిస్టు ఫోరం డివిజన్ శాఖ వ్యవస్థాపకుడు ఎండీ ఖర్షీద్ హుస్సేన్ తెలిపారు. ఉర్దూఘర్ పరిధిలోని స్థలంలోనే రేకుల షెడ్డు ఉందని కమిటీ ప్రతినిధులు అంటున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులకు 3 నెలల క్రితం ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించినట్లు వివరించారు.తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు విచారణ చేపట్టారు. స్థల నిర్ధారణ కోసం కొలతలు తీసుకున్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మహారాజా (తెలుగు) – 12.45, 6.40, 9.45 మ్యూజిక్ షాప్ మూర్తి (తెలుగు) 3.50
స్క్రీన్-2 –	హరోం హర (తెలుగు) – 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) – 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	చందు చాంపియన్ (హిందీ) – 12.10, 6.05, 9.15, నీ దారే నీ కథ (తెలుగు) – 3.20

మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలి


కమ్మర్‌పల్లిలో సర్వే పరిశీలిస్తున్న డీపీవో

కమ్మర్‌పల్లి: మిషన్ భగీరథ తాగునీరు సరఫరాపై చేస్తున్న ఇంటింటి సర్వేను ఈనెల 20లోపు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి ఆదేశించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ తాగునీటిపై నిర్వహిస్తున్న సర్వేను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో సదాశివ్ ఉన్నారు.

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. గురువారం రెంజల్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి తిరుగుతు వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గౌస్, కార్యదర్శి రాజేందర్‌రావ్‌లు ఉన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మిషన్ భగీరథ నీటి సరాఫరా ఏ విధంగా ఉందనేది గురువారం డీఎల్‌పీవో శ్రీనివాస్ మండల కేంద్రంలో పర్యటించి సంబంధిత పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఇంటింటికి నీరు సరాఫరా అవుతుందా లేదా అనేది స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఈ ఆశ్రితారెడ్డి

ఆర్మూర్‌టౌన్: ట్రాన్స్‌కో సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టౌన్-2 ఏఈ ఆశ్రితారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమన్ విద్యుత్ కార్యాలయంలో ట్రాన్స్ కో డీఈ హరిచంద్ నాయక్ సూచనల మేరకు ట్రాన్స్‌కో సిబ్బంది ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రితారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లు చెల్లించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది విద్యుత్ స్తంభాలపై పనులు చేసేటప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేసి జాగ్రత్తలు పాటించాలన్నారు.

సమాచారం..

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్ గురువారం తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అలాగే కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ముస్లిం, క్రిస్టియన్, సిక్కు మైనార్టీలు విద్యనభ్యసించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8985783112, 8106424751, 9014503903.

16న కబడ్డీ అసోసియేషన్ సమావేశం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16న జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్ గురువారం తెలిపారు. కార్యవర్గం, పాలక వర్గ సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.